క్లుప్తంగా

మండపాలకు అనుమతి తప్పనిసరి

కొల్లాపూర్: గణేష్ విగ్రహాలు ఏర్పాటు చేసే మండపాలకు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని కొల్లాపూర్ ఎస్ఐ హృషికేష్ కోరారు. పోలీస్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని తెలిపారు. సంబంధించిన పత్రాలను పోలీస్‌స్టేషన్‌లో సమర్పిస్తే భద్రతా చర్యలు తీసుకుంటామని వివరించారు. ఇతరులకు ఇబ్బందుల కలిగించకుండా ఉత్సవాలు నిర్వహించాలని ఆయన కోరారు.

శాంతి యుతంగా జరుపుకోవాలి

అమ్రాబాద్: పండగలు శాంతియుతంగా జరుపుకోవాలని పదర ఎస్ఐ సద్దాం హుస్సేన్ అన్నారు. మంగళవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ గణేష్ మండపాలకు అనుమతి తీసుకోవాలని కోరారు.

కోడేరు: మండలంలో వినాయకులను నెలకొల్పే మండపాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎస్ఐ జగదీశ్వర్ అన్నారు. అనుమతులు లేకుండా మండపాలను ఏర్పాటు చేసుకోవద్దన్నారు.

ధర్నాకు తరలిన మాలలు



కొల్లాపూర్: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద చేపట్టిన ధర్నాకు కొల్లాపూర్ నుంచి మాల సంఘం నాయకులు తరలివెళ్లారు. తెలంగాణ మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు కలమంద శేఖర్ నేతృత్వంలో ఢిల్లీకి బయలుదేరారు. ఎంపీ మల్లురవితో పాటు పలువురు ప్రముఖులను కలిసినట్లు శేఖర్ తెలిపారు. వర్గీకరణ ద్వారా దళితుల మధ్య విభజన ఏర్పడిందని, దళితులను సంఘటితంగా ఉంచేందుకు పార్లమెంట్‌లో గళం వినిపించాలని పేర్కొన్నారు.

'గాంధీ' విగ్రహం ధ్వంసం బాధాకరం

కల్వకుర్తి రూరల్: మహాత్మాగాంధీ విగ్రహాన్ని ధ్వంసం చేయడం బాధకరమని ఆర్యవైశ్య ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వీరమల్ల వెంకటస్వామి పేర్కొన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మహనీయుల విగ్రహాలను ధ్వంసం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. విగ్రహ ధ్వంసాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో శోభన్ బాబు, రాజేష్, రాఘవేందర్, వెంకటేశ్వర్లు, మధుసూదన్, జంగయ్య, నరేందర్, శ్రీనివాసులు, శ్రీను తదితరులు ఉన్నారు.

ఇళ్ల నిర్మాణ పనుల పరిశీలన



తిమ్మాజిపేట: మండలంలోని మరికల్‌లో మంగళవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనులను ఎంపీడీఓ లక్ష్మీదేవి పరిశీలించారు. గ్రామానికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారుల ఇంటికి వెళ్లి ఇళ్ల నిర్మాణం త్వరగా చేపట్టాలని సూచించారు. ఇళ్ల నిర్మాణం త్వరగా చేపట్టి పనులు పూర్తిచేసిన వారికి మొదటివిడతగా బిల్లులు అందిస్తామన్నారు. ఆమె వెంట జూనియర్ అసిస్టెంట్ యూసుఫ్, పంచాయతీ కార్యదర్శి యాదయ్య ఉన్నారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

తెలకపల్లి: విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్సు కౌన్సిలర్ శ్రీరాం ఆర్యా అన్నారు. మంగళవారం మండలంలోని ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. లీగల్ సర్వీస్, పలు పిల్లల స్కీమ్స్‌పై అవగాహన కల్పించారు. బాలల హక్కుల గురించి వివరిస్తూ బాల బాలికలు అందరు పాఠశాలకు రావాలని ప్రతి ఒక్కరు చదువుపై మక్కువ పెంచుకొని ఉన్నత స్థానాలకు ఎదగాలన్నారు. విద్యార్థులు ఫోన్ వాడకంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. బాలికలకు సమస్యలు ఎదిరైతే షీం టీంకు, చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్ 1098కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఉచిత న్యాయ సహాయం కోసం 15100 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం గోవర్ధన్‌రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



బోనమెత్తి.. ఊరేగింపుగా వెళ్లి



వంకేశ్వరంలో ముత్యాలమ్మ అమ్మవారికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ



చారకొండ మండలం జేపల్లిలో బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

సాక్షి, నెట్‌వర్క్: నాగర్‌కర్నూల్ జిల్లాలోని పలు మండలాల్లో మంగళవారం బోనాల పండగను నిర్వహించారు. అమ్మవారి ఆలయాలను వేప, మామిడి ఆకులతో ముస్తాబు చేశారు. గ్రామాల్లో మహిళల సందడి కన్పించింది. జోరువానలో కూడా బోనాలు ఎత్తుకొని అమ్మవారి ఆలయానికి చేరుకొని కుటుంబసమేతంగా దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

■ పెద్దకొత్తపల్లి మండలంలోని నక్కల పల్లి, దేవుని తిరుమలాపూర్, కల్వకోలు గ్రామాల్లో పోచమ్మ దేవతకు బోనాలు సమర్పించారు.

■ తాడూరు మండల కేంద్రంతో పాటు భలాన్‌పల్లిలో పోచమ్మ బోనాల పండుగ సందర్భంగా మహిళలు బోనాలతో ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. అలయం చుట్టు ప్రదక్షిణలు చేసి నైవేద్యం సమర్పించారు.

■ లింగాల మండలంలోని రాంపూర్‌లో డప్పు చప్పుళ్ల మధ్య మహిళలు ఊరేగింపుగా పోచమ్మ ఆలయానికి చేరుకొని బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

■ తిమ్మాజిపేట మండల కేంద్రంతో పాటు అప్పాజిపల్లి, గొరిట, గుమ్మకొండ, పోతిరెడ్డిపల్లి, మరికల్, మారేపల్లి, నేరళ్లపల్లి తదితర పలు గ్రామాల్లో పోచమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. మహిళలు శివసత్తులతో ఊగారు. పోతురాజుల విన్యాసాలతో ఆకట్టుకున్నారు.

■ పెంట్లవెల్లి మండలంలోని గోపులాపురంలో బోనాల ముందు డప్పులకు అనుగుణంగా నృత్యాలు చేశారు. మహిళలు బొడ్డెమ్మలు కొడుతూ ముందుకు సాగారు. యువకులు పెద్ద ఎత్తున కేరింతలు కొడుతూ ఊరేగింపుగా వెళ్లారు. అనంతరం అమ్మవారికి బోనాలు సమర్పించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

■ కల్వకుర్తి మండలంలోని సుద్దకల్, రఘుపతిపేట గ్రామాల్లో పోచమ్మ బోనాల సందర్భంగా పండుగ సందడి కన్పించింది. బంధువులు, స్నేహితులు రావడంతో గ్రామాలు కిటకిటలాడాయి.

భక్తిశ్రద్ధలతో రేణుక ఎల్లమ్మ బోనాలు

చారకొండ మండలంలోని జేపల్లిలో రేణుక ఎల్లమ్మ బోనాల వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. డప్పు చప్పుళ్లు, బైండ్లవారి శక్తి పూనకాల మధ్య మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

■ అమ్రాబాద్ మండలంలోని మాధవానిపల్లి, పదర మండలం వంకేశ్వరం గ్రామాల్లో ముత్యాలమ్మ బోనాలు నిర్వహించారు. అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.



తాడూరు మండలం బలాన్‌పల్లిలో..



లింగాల మండలం రాంపూర్‌లో ..



పెంట్లవెల్లి మండలం గోపులాపూర్‌లో..

బీమా పథకాలపై అవగాహన



మాట్లాడుతున్న బ్యాంక్ మేనేజర్ మృదల్ మోహన్

లింగాల: ప్రతి ఒక్కరు బీమా చేయించుకొని ధీమాగా ఉండాలని ఎస్‌బీఐ మేనేజర్ మృదల్ మోహన్ కోరారు. మండలంలోని శాయిన్‌పేటలో బీమా పథకాలపై ఆయన ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ 18 నుంచి 50 సంవత్సరాల వయస్సు లోపు వారు ప్రధాన మంత్రి జీవన జ్యోతి పథకానికి అర్హులన్నారు. అదే విధంగా 18 నుంచి 70 సంవత్సరాల లోపు వారు ప్రధాన మంత్రి సురక్ష యోజన పథకానికి అర్హులన్నారు. అటల్ పెన్షన్ యోజన, సుకన్య సమృద్ధి యోజన, బ్యాంక్ ఖాతాల నిర్వహణ ఈకేవైసీ, నామినీ, ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్థిక అక్షరాస్యత కేంద్రం కౌన్సిలర్లు ఎండీ మన్సూర్, రూపేష్, శ్రీశైలం, బ్యాంక్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా ఫొటోగ్రఫీ దినోత్సవం



నాగర్‌కర్నూల్‌లో నివాళులర్పిస్తున్న ఫొటోగ్రాఫర్లు



తాడూరులో నివాళులర్పిస్తున్న ఫొటోగ్రాఫర్లు

కందనూలు: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రాజు కెమెరా సృష్టి కర్త డాగురేకు నివాళులు అర్పించి మాట్లాడారు. ఫొటో గ్రాఫీ ఒక వ్యాపారం కాదు ఇది ఒక కళ అని పేర్కొన్నారు. ఫొటోగ్రఫీ రంగంలో ఎదుర్కొంటున్న సవాళ్లపై చర్చించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి, నియోజకవర్గ అధ్యక్షుడు శ్రీకాంత్, కార్యదర్శి శివ, కోశాధికారి సలామ్, మాజీ జిల్లా అధ్యక్షుడు కొప్పుల రమేష్, గంధం ప్రసాద్, సభ్యులు సుధాకర్ రెడ్డి, రఘు, అజయ్, వీరేందర్, శ్రీనివాసులు, సహదేవుడు, రంజిత్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

కెమెరా సృష్టికర్త దాగురేకు నివాళి

తాడూరు: మండల కేంద్రంలో ఫొటోగ్రాఫర్, వీడియోగ్రాఫర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా కెమెరా సృస్టికర్త డాగురే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఫొటోగ్రాఫర్లు బాలు, చలమయ్య, రవి, మహముద్, శివ, కురుమయ్య పాల్గొన్నారు.

ముత్యాలు సేవలు మరచిపోలేం



వెల్దండ: ముత్యాలు సేవలు మరచిపోలేమని మాజీ సర్పంచ్ భూపతిరెడ్డి, ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు బచ్చు రామకృష్ణ అన్నారు. మంగళవారం మండల కేంద్రం తొలి సర్పంచ్ బిమాండ్ల ముత్యాలు వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ 13ఎకరాల వ్యవసాయ భూమిని విద్యాసంస్థలకు విరాళం అందించారని గుర్తుచేశారు. ఆయన ఇచ్చిన స్థలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కస్తూర్బాగాంధీ పాఠశాల, మోడల్ హైస్కూల్‌లను నిర్మించుకున్నట్లు తెలిపారు. స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నారని పేర్కొన్నారు. మట్ట వెంకటయ్యగౌడు, నాయకులు విజేందర్‌రెడ్డి, అంజన్ రెడ్డి, కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వజ్రలింగం, ఆంజనేయులు, రాజయ్య, కృష్ణ, శ్రీను, ఎర్రశ్రీను ముదిరాజ్, హమీద్, భరత్‌గౌడు, శివ, కృష్ణ , మధన్‌గౌడు, యాదగిరి తదితరులు ఉన్నారు.

రీ కేవైసీ తప్పనిసరి



బిజినేపల్లి: బ్యాంకులో రీ కేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని ఎస్‌బీఐ ఆర్‌బీఓ సునీత అన్నారు. మంగళవారం మంగళవారం వెల్గొండలో ఫైనాన్షియల్ ఇంక్లూషన్ సాచురేషన్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌బీఓ సునీత మాట్లాడుతూ ప్రధాన మంత్రి బీమా యోజన, ప్రధాన మంత్రి జీవనజ్యోతి, అటల్ పెన్షన్ యోజన ఇన్సురెన్స్ వంటి ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మేనేజర్ నవీన్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

పెద్దకొత్తపల్లి: మారేడుమానుదిన్నె గ్రామానికి చెందిన గిరిజన ఇటీవల అనారోగ్యంతో మృతిచెందింది. కాంగ్రెస్ నాయకులు చందాలు వేసుకొని రూ.13,500ను మంగళవారం మృతురాలి భర్త వెంకటేష్‌కు మాజీ సర్పంచ్ బాలునాయక్, మాజీ ఎంపీటీసీ వెంకటస్వామిగౌడు అందజేశారు. కార్యక్రమంలో శ్రీహరిరావు, వెంకటస్వామి, బాలయ్య, రేణయ్య, బ్రహ్మాచారి, రాజు, బాలపీరు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య అందించాలి



పెద్దకొత్తపల్లి: కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో బాలికలకు నాణ్యమైన విద్యను అందించాలని తహసీల్దార్ శ్రీనివాసులు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయాన్ని తనిఖీ చేశారు. విద్యాలయంలోని పరిసరాలను, వంట గదులు, తరగతి గదులను ఆయన పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. బాలికలకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలన్నారు. బాలికల విద్యా సామర్థ్యాలను ఆయన పరిశీలించారు. విద్యలో వెనుకబడిన వారిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఓ లత ఉన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



రేషన్‌కార్డు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, నాయకులు

ఊర్కొండ: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని మంగళవారం రైతు వేదికలో నిర్వహించిన రేషన్ కార్డులను ఆయన పంపిణీ చేశారు. అంతకుముందు ఊర్కొండపేట పబ్బతి ఆంజనేయ స్వామిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ పాలక మండలి సభ్యులతో ఆలయానికి సంబంధించిన అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిరుద్రెడ్డి మాట్లాడుతూ అర్హులందరికీ పారదర్శకంగా పథకాలు అందిస్తున్నామన్నారు. జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు కృషి చేస్తున్నామన్నారు. మండలానికి 163 కొత్త రేషన్ కార్డులు మంజూరు అయ్యాయని, 1619 పాత రేషన్ కార్డుల్లో కొత్తగా పేర్లు నమోదు చేసుకున్నారన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ జనార్దన్ రెడ్డి, తహసీల్దార్ యూసుఫ్ అలీ, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెంకటయ్య గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ ద్యాప నిఖిల్ రెడ్డి, దేవాలయ చైర్మన్ సత్యనారాయణ రెడ్డి, దేవాలయ ఈఓ సత్య చంద్రారెడ్డి, స్థానిక ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు,లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



బిజినేపల్లిలో వైద్యాధికారికి వినతిపత్రం అందిస్తున్న ఆశాలు

బిజినేపల్లి/చారకొండ/వెల్దండ/పెద్దకొత్తపల్లి: పెండింగ్ వేతనాలు చెల్లించాలని కోరుతూ మంగళవారం బిజినేపల్లి మండల కేంద్రంలోని వైద్యాధికారికి డా.శివకుమార్‌కు, చారకొండ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి మంజుభార్గవికి, వెల్దండలో వైద్యాధికారిణి సింధుకు, పెద్దకొత్తపల్లిలో డాక్టర్ నారాయణస్వామికి వినతిపత్రాలు అందజేశారు. జూలై నెలలో ఇవ్వాల్సిన పారితోషికాలు ఇప్పటివరకు ఇవ్వలేదన్నారు. ప్రభుత్వం స్పందించకుంటే ఈనెల 25న కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపడుతామన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం ఆశాలకు రూ.50లక్షల ఇన్సూరెన్స్ కల్పించాలన్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కార్యక్రమంలో కృష్ణవేణి, అలివేళ, భాగమ్మ, వెంకటమ్మ, సుకన్య, లక్ష్మీ, మానస, ఎండీ వలీయా బేగం, విద్యారాణి, ఆశాలు రజీయా, సనాబేగం, రజిత, స్వర్ణలత, స్వప్న, వసంత, సుజాత, మంగ, జయమ్మ, మమత, చంద్రకళ రాణి, అరుణ, నీలమ్మ, సాయి లీల, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వకుంటే ఆందోళన చేస్తాం



కోడేరు: అర్హులైన ప్రతి ఒక్కరు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వకుంటే ఆందోళన చేపడుతామని సీపీఎం మండల కార్యదర్శి శివశంకర్ డిమాండ్ చేశారు. అన్ని అర్హతలు కల్గినా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కావడం లేదన్నారు. మంగళవారం సీపీఎం ఆధ్వర్యంలో జనుంపల్లిలో ఇంటింటి సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామాల్లో పర్యటించి నిజమైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా గ్రామంలో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు ఉన్నా రోడ్లన్నీ బురదమయంగా మారాయని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, మంత్రి జూపల్లి కృష్ణారావు చొరవ తీసుకొని తక్షణమే రోడ్లు, పారిశుద్య పనులు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం గ్రామ కమిటీ సభ్యులు రామస్వామి, ధర్మేందర్, మహేష్, పాల్గొన్నారు.

శేరిఅప్పారెడ్డిపల్లి వాసికి డాక్టరేట్

చారకొండ: మండలంలోని శేరిఅప్పారెడ్డిపల్లికి వాసి, ఉపాధ్యాయులు, కవి మల్కేడి రాంచందర్‌జీ ఉస్మానియా యూనివర్సిటీ మహశ్వేతాదేవి-కేశవ రెడ్డి నవలలో గిరిజన జీవన అంశంపై డాక్టర్ చంద్ర శేఖర్ రావు పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేయడంతో డాక్టరేట్ పొందారు. మంగళవారం ఉస్మానియా యూనివర్సిటిలో 84వ స్నాతకోత్సవం సందర్భంగా ఇస్రోచైర్మన్ వి. నారాయణన్, ఉస్మానియా యూనివర్సిటి వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కుమార్ ములుగం చేతుల మీదుగా కవి రాంచందర్‌జీ డాక్టరేట్ పట్టా అందుకున్నారు.

అచ్చంపేట రూరల్: ఉస్మానియా యూనివర్సిటీ 84వ స్నాతకోత్సవంలో నల్లమల ప్రాంతానికి చెందిన యువకుడు పీహెచ్‌డీ డాక్టరేట్ పట్టా పొందాడు.

పీహెచ్‌డీ పట్టా



నాగర్‌కర్నూల్: నాగర్‌కర్నూల్‌కు చెందిన పి.జ్యోతి మంగళవారం హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహించిన కార్యక్రమంలో పీహెచ్‌డీ పట్టా అందుకుంది.

పొంగిపొర్లుతున్న వాగులు



నాగర్‌కర్నూల్ బాలుర జూనియర్ కళాశాల ఆవరణలో..



కాంసానిపల్లి సమీపంలో రోడ్డుపై ఉధృతంగా పారుతున్న చీకటి వాగు

ఉప్పునుంతల: ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలతో మంగళవారం మండలంలోని వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. అన్ని చెరువులు కుంటలు అలుగులు పారుతున్నాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు వర్షం తెరిపి లేకుండా పడటంతో వరద ఉధృతి పెరిగింది. మండలంలోని మొల్గర వద్ద దుందుబీ వాగు కాజ్‌వే రోడ్డు పైనుంచి ఉధృతంగా ప్రవహిస్తుండటంతో 10 రోజుల నుంచి రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. మామిళ్లపల్లి-దాసర్లపల్లి మార్గంలో ఉన్న చిలుకల వాగు రోడ్డు పైనుంచి ప్రవహిస్తోంది. ఈ మార్గంలో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అదేవిధంగా కాంసానిపల్లి సమీపంలో తండాకు వెళ్లే మార్గంలో ఉన్న చీకటి వాగులో వరదనీరు రోడ్డు కల్వర్టు పైనుంచి, లక్ష్మాపూర్- మర్రిపల్లి మార్గంలో ఉన్న కల్వర్టు రోడ్డుపై నుంచి వరదనీరు పారుతోంది. ముళ్లకంపను అడ్డుగా పెట్టి ప్రమాదాలు చోటుచేసుకోకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

జూనియర్ కళాశాల జలమయం

కందనూలు: నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని బాలుర జూనియర్ కళాశాల ఆవరణ జలమయమైంది. తరగతి గదుల్లోకి వర్షం నీరు చేరింది. ఆవరణలో చెట్లు నేలకొరిగాయి. కళాశాల భవనం ఎప్పుడు కూలుతుందోనని విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. ఆర్డీఓ, తహసీల్దార్, నోడల్ ఆఫీసర్ కళాశాలను సందర్శించారు.

పారుతున్న అలుగులు

తాడూరు: మండల కేంద్రంతో పాటు అయా గ్రామాల్లో వరుసగా కురుస్తున్న వర్షాల కారణంగా చెరువు, కుంటలు అలుగులు పారుతున్నాయి. భారీ వర్షాలకు ఆయా గ్రామాల్లో సాగు చేసిన పంటలు నీట మునిగాయి.

నిలిచిన రాకపోకలు

పెద్దకొత్తపల్లి: చంద్రబండ తండా సమీపంలో ఉన్న పెద్దవాగు అడవిలో కురుస్తున్న భారీ వర్షాలకు ఉధృతంగా ప్రవహించి తండా వాసులు ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా రాకపోకలు నిలిచిపోయాయి.



తాడూరులో బ్రిడ్జిపై నుంచి ప్రవహిస్తున్న వరద

అత్యవసరమైతే బయటకు రండి

తిమ్మాజిపేట: వర్షాల కారణంగా అత్యవసరమైతే బయటకు రావలని తహసీల్దార్ రామకృష్ణయ్య కోరారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు చెరువులు, కుంటలు నిండిపోయి వాగులు, అలుగులు పారుతున్నాయన్నారు. ప్రమాదకరంగా వరద వస్తోందన్నారు. పాతఇళ్లలో నివాసం ఉండొద్దన్నారు. హెల్ప్‌లైన్ 08540 293811 నంబరుకు ఫోన్ చేయాలని కోరారు.

జలపాతం కనువిందు

తెలకపల్లి: మండలంలోని రామగిరి దేవాలయ సమీపంలో రామగిరి గుట్ట పక్కన నుంచి వస్తున్న జలపాతం కనువిందు చేస్తోంది. జలధారను పరిసర ప్రాంతాల ప్రజలు చూసేందుకు బారులు తీరారు.

కూలిన ఇళ్లు



వెల్దండ మండలం జూపల్లిలో..

వెల్దండ: మండలంలోని కొట్రలో ఎండీ మనిబీన్ సంబంధించిన రేకుల ఇల్లు పాక్షికంగా కూలింది. గ్రామ కార్యదర్శితో పాటు రెవెన్యూ అధికారులు పరిశీలించి వివరాలు సేకరించారు.

చారకొండ: మండలంలోని జూపల్లి గ్రామానికి చెందిన జంతుక రాములు సంబంధించిన మట్టి ఇల్లు పాక్షికంగా దెబ్బతింది. పైకప్పు కూలి ఇంట్లోకి నీరు చేరింది. మండల కేంద్రంలో మట్టి ఇళ్లలో నివాసం ఉంటున్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సునీత, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.